# ఆఫ్టర్ వన్ మంత్

కె.రాజేశ్వరి

ఆఫీస్ నుండి నీరసంగా ఇంటికి వచ్చిన నేను మా ఇంటి వాతావరణం చూసి ఆశ్చర్యపోయాను.

ప్రతీరోజు ఇంటికి వచ్చేసరికి శ్రీమతికి చెరోపక్కా సోఫాలో కూర్చుని హోంవర్కు చేస్తూ మధ్యమధ్యలో వాళ్లమ్మ చూసే టీవీ సీరియల్స్ వైపు దొంగ చూపులు చూస్తూ కనిపించే మా సిసింద్రీలిద్దరూ ఇండియా క్రికెట్ టీం వరల్డ్ కప్ కొట్టేసినప్పుడు సారీ సాధించినప్పుడు ఎంతగా ఎంజాయ్ చేస్తారో అంత సంతోషంగా టీవీలో కార్టూన్స్ చూస్తూ ఎంజాయ్ చేస్తూ కనిపించేసరికి తెగ ఆశ్చర్యమేసింది.

ఏమిటబ్బా! నా శ్రీమతి ఇంట్లో లేదా ఏమిటి? అనుకొంటూ "ఒరే నానీ! మమ్మీ ఏదిరా?" అని అడిగాను.

మధ్యలో డిస్టర్బ్ చేశాననేమో ఓసారి నా వైపు సీరియస్‌గా చూసి ఎంపైర్ అవుట్ ఇచ్చినట్లుగా చూపుడు వేలు పైకెత్తి చూపించి టీవీ చూట్టంలో నిమగ్నమయ్యాడు.

ఈ టైంలో పైన ఏం చేస్తుందబ్బా... అనుకొంటూ మేడ మీదికి వెళ్లబోతున్న వాడినల్లా "అయ్యగారు! టీ తీసుకొండి" అని కొత్త గొంతు వినిపించటంతో ఆగిపోయాను.

ఎదురుగా టీ కప్పుతో ఓ ఇరవై ఏళ్ల యువతి నిలబడి ఉంది.

"ఎవర్నువ్వు?" కప్పు చేతిలోకి తీసుకొంటూ అడిగాను.

"అమ్మగారు వంటమనిషి కావాలంటే ఈ రోజే కొత్తగా వచ్చానండి"

వంటమనిషా? ఏమైంది లలితకి? ఎప్పుడన్నా ఒంట్లో బాగోలేకపోతేనే హోటల్లో తెస్తానంటే ఊరుకోదే అలాంటిది ఇప్పుడు వంట మనిషా?

మనసు ఏదో కీడు శంకిస్తుంటే ఒక్క గుక్కలో టీ తాగేసి గబగబా మేడపైకి పరిగెత్తాను.

మేడమీదున్న గదిలో టేబుల్ ముందున్న కుర్చీలో కూర్చుని సీరియస్‌గా ఏదో రాసుకొంటున్న లలితని చూడగానే కాస్త టెన్షన్ తగ్గింది.

'హమ్మయ్యా' అనుకొంటూ పరిగెత్తుకొని వచ్చానేమో కాస్త ఆయాసంగా అనిపించి కాసేపు అలుపుతీర్చుకొంటూ గుమ్మానికి ఆనుకొని నిలబడ్డాను.

'ఏమిటబ్బా ఈ వింత.. రోజూ ఈ టైంలో చదువుకొంటూ కూర్చునే పిల్లలు టీవీ చూస్తూ కూర్చోవడమేమిటి? టీవీ చూస్తూ కూర్చునే లలిత రాసుకుంటూ కూర్చోటమేంటి.. ఏమిటీ రివర్స్ సీన్? కొంపదీసి జంబలకిడి పంబ సినిమాలోలా ఈ రోజు వీళ్లకేమైనా జరిగిందా ఏమిటి? అయినా ఇంత సీరియస్‌గా ఏం రాస్తుందబ్బా... పిల్లల హోంవర్కు తను కానీ చేస్తుందా లేక ఒక్కసారిగా పెద్ద రచయితనవ్వాలనే కోరికేమైనా కలిగి ఏదైనా కథకానీ నవల కానీ రాస్తుందా?' ఆలోచనల నుండి తేరుకొని అటు చూసిన నేను ఉలిక్కిపడ్డాను.

టేబుల్ పక్కనా కిందా గుట్టలు గుట్టలుగా పుస్తకాలు.

వామ్మో! ఏమిటీ పుస్తకాలు. నేనెప్పుడు వీటిని మా ఇంట్లో చూడలేదే.

ఒక్కొక్కటి ఇంతింత లావున పెద్ద పెద్ద గ్రంథాల్లా ఉన్నాయే అనుకుంటూ దగ్గరగా వెళ్లి ఒక్కొక్కటి చేతిలోకి తీసుకొని చూశాను.

రామాయణం, మహాభారతం, భాగవతం, వెంకటేశ్వరస్వామి చరిత్ర, శివచరిత్ర, అయ్యప్పస్వామి చరిత్ర, బుద్ధచరిత్ర, శివాజీ, ఝాన్సీలక్ష్మీబాయి, గాంధీ, నెహ్రూల చరిత్రల దగ్గర్నుండి సినిమా హీరో హీరోయిన్ల చరిత్రలు, పొడుపు కథలు, సుమతీ శతకం, దాశరథీ శతకం, జనరల్ నాలెడ్జికి సంబంధించిన బుక్స్.. వామ్మో ఒకటని ఏమిటి దాదాపుగా ఓ లైబ్రరీనే మా ఇంట్లో దర్శనమిచ్చేసరికి అవాక్కయ్యాను.

ఏమిటే ఇవన్నీ... ఇప్పుడు వీటి అవసరమేమొచ్చింది. వీటన్నింటిని ఎక్కడి నుండి తెచ్చావు? అయోమయంగా చూస్తూ అడిగాను.

నన్ను చూసినా చూడనట్లే చేతిలో ఉన్న ఇంత లావుపాటి పుస్తకం చదువుతూ మధ్యమధ్యలో ఏవో పాయింట్లు నోట్ చేసుకుంటున్న లలిత చిన్నగా నవ్వి "కొన్ని కొన్నాను. కొన్ని లైబ్రరీ నుండి మరికొన్ని తెలిసిన వాళ్లింట్లో నుండి తెచ్చాను" అన్నది.

"ఇప్పుడు వీటి అవసరమేమొచ్చింది. కొంపదీసి అయ్యేయస్‌కి కానీ ప్రిపేరవుతున్నావా ఏం? నాకు తెలిసి దానిక్కూడా ఈ గ్రంథాలన్నీ బట్టీ పట్టాల్సిన అవసరం లేదే"

"ఆ ఒక్కటి అడక్కండి. ఆఫ్టర్ వన్ మంత్ నేనే మిటో వీటిని ఎందుకు తెచ్చానో అన్నీ మీకే అర్థమవుతాయి" రాజేంద్రప్రసాద్ స్టైల్లో అన్నది.

"ఆఫ్టర్ వన్ మంతా? ఆ తర్వాత ఏం జరుగుతుంది. ఆకాశం దిగి వస్తుందా.. భూమి బద్ధలవుతుందా.. మన ఇల్లేమైనా ఇంద్రభవనంలా మారిపోతుందా?" వెనక నుండి వచ్చి మెడచుట్టూ చేతులేస్తూ సరదాగా అడిగాను.

తను రాసేది నేను చూడకూడదనేమో పుస్తకం మూసేసి "అవేమీ కావు కానీ ఈ ఒక్క నెల రోజులు నా జోలికి రాకుండా బుద్ధిగా ఉండండి. ఆఫీస్ నుండి త్వరగా వచ్చి కాస్త పిల్లల హోంవర్కు అదీ చూడండి. ఈ నెల రోజులు వంటమనిషి ఏం వండిపెట్టినా వంకలు పెట్టకుండా సర్దుకుపొండి. ప్లీజ్.. ఈ ఒక్క నెల ఎలాగోలా ఓపిక పట్టారంటే తర్వాతంతా మీ ఇష్టం" బతిమాలే ధోరణితో అడిగింది.

ఆ మాటలకి కాస్త మెత్తబడ్డాను. "ఒక్క నెల తర్వాత ఏం జరుగుతుందే. ఎవరైనా నీక్కాని ఏదైనా మంత్రిపదవి కానీ ఇస్తామన్నారా ఏం" నున్నటి బుగ్గల మీద వేలితో సున్నాలు చుడుతూ అడిగాను.

"అదిగో.. ఇలాంటి పన్లే వద్దనేది. అయినా బోడి మంత్రి పదవికి ఇంతోటి కష్టపడాలా ఏమిటి? వేలిముద్రేయటం వస్తే చాలదూ" నవ్వింది.

"మరీ నెల రోజులంటే మాటలా నా వల్ల కాదు బాబూ!" గారాలు పోతూ అన్నాను.

"తప్పదు బాబూ! నా కోసం కాస్త ఓపిక పట్టాలి. మా బుజ్జి కదూ" వెనక్కి తిరిగి నా రెండు బుగ్గల్ని తన రెండు చేతివేళ్లతో పట్టుకొని సాగదీస్తూ అన్నది.


"ఈ వంట మనిషేమిటో.. ఈ పుస్తకాల కొండలేమిటో.. వీటి మధ్య వంచిన తల ఎత్తకుండా నువ్వు

కూరుకుపోవటమేమిటో.. ఏమిటో.. నాకేం అర్థం కావటం లేదు” అదేదో సినిమాలో అఘని స్టైల్లో అన్నాను.

“ఆఫ్టర్ వన్ మంత్ అన్నీ మీకే అర్థమవుతాయన్నాను కదా. అందాకా కాస్త ఓపిక పట్టండి. ప్రస్తుతం తమరెళ్లి కాస్త పిల్లల హోంవర్క్ సంగతి చూడండి. పదండి పదండి” అంటూ తన రెండు చేతుల్లో నా భుజాలు పట్టుకొని నన్ను ఆ రూం నుండి బయటకి నెట్టింది.

ఆ రోజు నుండి అన్నీ మేడ మీదే. భోజనం, టిఫిన్ పనిమనిషి చేత పైకే తెప్పించుకునేది. పిల్లలెప్పుడైనా “మమ్మీ!” అంటూ సరదాగా వెళ్లినా దగ్గరకి తీసుకొని ముద్దు చేయకపోగా ఏదో ఒకటి చెప్పి కిందకి పంపించేది. నన్నైతే సరేసరి.. పైకి అడుగు కూడా పెట్టనిచ్చేది కాదు.

“డాడీ! మమ్మీకి ఇప్పుడేమైనా ఎగ్జామ్సా?” మా లలితని ఆ పరిస్థితిలో చూసిన పిల్లలిద్దరు అమాయకంగా అడుగుతుంటే ఏం చెప్పాలో తెలియక



“అవును..కాదు” అన్నట్లుగా తల నిలువుగా అడ్డంగా ఊపాను.

అసలు నాకు తెలిసేడిస్తేగా వాళ్లకి చెప్పటానికి. ఎప్పుడో ఏ అర్థరాత్రో వచ్చి నా పక్కన పడుకునేది. మళ్లీ నేను లేవకముందే లేచి పైకెళ్లిపోయేది. అసలు కింద కనిపించటమే కరువైపోయింది.

పది రోజుల తర్వాత ఓ రోజు సాయంత్రం ఆఫీసు నుండి ఇంటికి వచ్చేసరికి హాల్లో ఫోన్ ముందు కూర్చుని కనిపించింది. ఇన్ని రోజుల తర్వాత అలా చూసేసరికి నాకెంతో సంతోషంగా అనిపించి గబగబా డ్రెస్ మార్చుకొని వచ్చి ఎదురుగా కుర్చీలో కూర్చున్నాను.

“హలో! వడ్డాణానికి ఎన్ని గ్రాముల బంగారం పడుతుందండి? ఆహా...అలాగా చిన్న పిల్లల వడ్డాణానికైతే.. అదే టెన్ ఇయర్స్ లోపు పిల్లలకి.. సరే థాంక్సండి”

లలిత సంభాషణంతా వింటున్న నేను తను ఫోన్ పెట్టేయగానే “వడ్డాణమేంటే. ఎవరికి?” అనుమానంగా చూస్తూ అడిగాను.

“ఎవరికేమిటి నాకు పాపకి”

తల గిర్రున తిరిగినట్లయింది. “ఇప్పుడీ వడ్డాణం పిచ్చేంటే. ఎంత ఖర్చవుతుందో తెలుసా?”

“షాపతను చెప్పాడుగా రెండొందల గ్రాముల్లో నాకు, ఓ వంద గ్రాముల్లో పాపకి వస్తుందట” పల్లీలు కొన్నంత తేలిగ్గా అనేసింది.

“మూడొందల గ్రాములంటే ఎన్ని లక్షలవుతుందో తెలుసా నీకు. మార్కెట్లో బంగారం ధర రాకెట్ కన్నా వేగంగా ఆకాశాన్ని తాకుతుంటే ఇప్పుడు నీకీ వడ్డాణం కోరికేంటే?”

“ఇప్పుడు మిమ్మల్నేం కొనివ్వమనటం లేదు కదా. వడ్డాణాలే కాదు ఒక్క నెలాగండి మీకు మెళ్లో చెయిన్, బ్రాస్‌లెట్, ఐదువేళ్లకి ఉంగరాలు.. అన్నీ చేయిస్తాను. కావాలంటే చూడండి”

‘దీనికేమైనా పిచ్చిపట్టలేదు కదా’ అయోమయంగా చూశాను.

“ఏమిటలా చూస్తారు దెయ్యాన్ని చూసినట్లు. ఆఫ్టర్ వన్ మంత్ నేను చెప్పినట్లు అన్నీ వస్తాయి. కావాలంటే చూసుకోండి” మహారాణిలా ఫోజు పెట్టింది.

“అదే... ఎలాగా అని. ఏదైనా లాటరీ కానీ తగిలిందా? లేక ఎవరైనా పిల్లలు లేని జమిందారు తన ఆస్తంతా నీ పేర్న రాసి టపా కానీ కట్టాడా?”

“ఆ ఒక్కటీ అడక్కండి. సస్పెన్స్ అన్నాగా. ఆఫ్టర్ వన్‌మంత్ సారీ...సారీ... ఇంకెంత ఇంకొక్క ఇరవై రోజులు ఓపిక పట్టండి చాలు అన్నీ మీకే తెలుస్తాయి”

‘దీని మాటలేమిటో ఇరవై రోజుల తర్వాత ఏం జరుగుతుందో ఓ తిరుమలేశా... నువ్వే దిక్కు తండ్రీ’

మనసులోనే దేవుణ్ని ప్రార్థించాను.

ఓ రోజు రాత్రి పడుకోబోతూ "ఫస్టు రాత్రికి మన నలుగురికి హైదరాబాద్‌కి టిక్కెట్లు రిజర్వు చేయించండి" అన్నది.

"ఇప్పుడు హైదరాబాద్ ఎందుకే. పిల్లలకి సెలవులూ కావు నాకు తెలిసి అక్కడ ఎలాంటి ఫంక్షన్స్ కానీ పెళ్లిళ్లు కానీ లేవు" అయోమయంగా అడిగాను.

"అబ్బ.. అన్నిటికి ప్రశ్నలడక్క చెప్పింది చెయ్యండి. ఇంకెంత ఇవాళ ఇరవై ఆరు. ఇంకొక్క నాల్రోజులు ఓపిక పట్టండి. అన్నీ మీకే తెలుస్తాయి"

అమ్మగారు ఆర్డర్ వేశాక తప్పదు కదా మర్నాడు ఆఫీస్‌కి వెళ్లేముందు ఆమెగారు చెప్పినట్లే హైదరాబాద్‌కి టిక్కెట్లు బుక్ చేశాను.

ముప్పైన అందరి బట్టలు సూట్‌కేసుల్లో సర్ది కాసేపు పైకెళ్లి పుస్తక పఠనం చేసి అర్థరాత్రి దాటాక వచ్చి పడుకుంది.

ఇన్నేసి పుస్తకాలు చదవటం ఏమిటో ఈ పిచ్చి రాతలేమిటో.. ఇప్పుడీ హైదరాబాద్ ప్రయాణమేమిటో.. ఎంతగా ఆలోచించినా అర్థం కాలేదు. ఆలోచనల్లో పడి ఎప్పుడు నిద్ర పట్టిందో ఏమో హఠాత్తుగా ఒంటి మీద పిడుగుల వర్షం పడుతున్నట్లనిపించి గబుక్కున కళ్లు తెరిచాను.

"ఒరే మీ కళ్లకి నేనెలా కనిపిస్తున్నాన్రా. ఇన్ని రోజుల నుండి ఇంతగా కష్టపడింది ఇదంతా మీకప్పజెప్పటానికంట్రా. ఖబడ్దార్ నా సంగతి మీకింకా తెలియదేమో. పల్నాటి బిడ్డనిరా" పెద్దపెద్దగా అరుస్తూ మహంకాళిలా ఎగిరెగిరి నామీద తన్నుల వర్షం కురిపిస్తోంది.

ఓ క్షణం బిత్తరపోయాను. అంతలోనే తేరుకొని "ఏయ్ లలితా! ఈ తన్నులేంటి. మంచం మీద ఈ గెంతులేంటి. ఏమిటే ఈ గొడవ?" రెండు చేతులు అడ్డం పెట్టి లలిత తన్నులు కాచుకుంటూ పెద్దగా అరిచాను.

"రేయ్ ముందు నా కళ్లముందు నుండి వెళ్లిపోండిరా. ఇంకొక్క క్షణం ఇక్కడున్నారంటే మీ అంతు చూస్తాను. ఈ లలితంటే అంత పిచ్చిదనుకున్నారా. అరకిలో బంగారాన్ని అంత తేలిగ్గా మీకెలా చిక్కనిస్తాన్రా. దొంగ రాస్కెల్స్ పొండిరా... పొండి" అంటూ ఈడ్చి ఒక్క తన్ను తన్నింది.

ఎగిరి మంచం మీద నుండి కింద పడ్డాను.

"ఒరేయ్" అంటూ తను కూడా మంచం మీద నుండి ఇంతెత్తున ఎగిరి నామీదికి దూకబోవటం చూసి గబుక్కున పక్కకి తప్పుకున్నాను. దాంతో తను కూడా వచ్చి నా పక్కనే కింద పడింది.

అప్పుడు మూలిగింది "అబ్బా" అని.

ఒక్కసారి బెడ్‌లైట్ వెలుగులో గదంతా పరిశీలించి చూసి అప్పుడే స్పృహలోకి వచ్చినదానిలా "ఏమిటండి! మనిద్దరం ఇలా కింద పడిపోయి ఉన్నామేమిటి ఏం జరిగిందండి?" హాశ్చర్యపడిపోతూ అడిగింది.

"ఆ ఏం జరిగిందా? అంతా తమరి నిర్వాకమే. చేసిందంతా చేసి నేనడగాల్సిన ప్రశ్నని నన్నడుగుతున్నావా?" పైకి లేవబోయి నడుం కలుక్కుమనటంతో "అమ్మా" అంటూ బాధగా కూర్చుండిపోయాను.

"నేనా.. నేనేం చేశాను?"

"ఏం చేశావా? రెచ్చిపోయి పిచ్చపిచ్చగా తన్నింది చాలక ఏం చేశానని మెల్లగా అడుగుతున్నావా? అరకిలో బంగారమేంటి? ఎవరో తీసికెళ్లటమేమిటి? నాకీ వీర లెవెల్లో తన్నులేంటి? ఈమధ్య నీకేమిటో అయిపోతుందే. రేప్పొద్దున్నే డాక్టర్ దగ్గరకి తీసుకెళ్లాల్సిందే నిన్ను"

"నాకేం కాలేదండి. ఏదో కలొచ్చింది. అంతే"

"ఏం కలే తల్లీ నా ప్రాణం తీయటానికి. నీ వాలకం చూస్తుంటే నాకు పిచ్చి పట్టేలా ఉంది. ఇప్పుడైనా చెప్పవే తల్లీ ఏమిటిదంతా?" లాలనగా అడిగాను.

"ఏం లేదండి ఒళ్లంతా బంగారం ప్రోగ్రాంలో పాల్గొనాలని చాలా ఉత్సాహంగా ఉందని 'ఆ' టీవీ వాళ్లకి లెటర్ రాశాను. రేపు రెండో తారీఖున హైదరాబాద్ టీవీ స్టూడియోకి వచ్చి కలవమని నెల క్రిందట లెటరు పంపారు. అందుకనే ఈ నెల రోజుల నుండి ఆ పుస్తకాలన్నీ తెచ్చి చదివి వాటిలోని ముఖ్యమైన పాయింట్స్ అన్నీ నోట్ చేసుకుంటున్నాను. ముందుగా చెప్పకుండా గోల్డ్ గెలుచుకున్నాక ఒక్కసారిగా చెప్పి సర్‌ప్రైజ్ చేద్దామని మీకు చెప్పలేదండి. అంతే"

"ఆ సర్‌ప్రైజ్ సరే. ఇప్పుడీ సర్‌ప్రైజ్ ఏమిటి? మంచం మీద ఈ గెంతులేంటి ఎగిరెగిరి ఈ తన్నడమేంటి?"

పక్కకి తిరగబోయి "అమ్మా!" అంటూ మూలిగి నిదానంగా చెప్పటం మొదలెట్టింది. "రేపే కదండి మన ప్రయాణం. 'ఒళ్లంతా బంగారం' ప్రోగ్రాంలో ఏం ప్రశ్నలడుగుతారో ఏం సమాధానం చెప్పాలా అని అదే ఆలోచనలతో నిద్రపోయానేమో ప్రోగ్రాంలో పాల్గొన్నట్లు అరకేజీ బంగారం గెలుచుకున్నట్లు కలొచ్చిందండి. అబ్బ.. ఎంత మంచి కలని" అంటూ పూర్తిగా కలలో నిమగ్నమైపోయి చెప్పటం ప్రారంభించింది.


"లలితగారూ" అని పిలవటంతో ఎంతో సంతోషంగా దయాస్ మీదికి వెళ్లి యాంకర్ 'అభయ భామ'కి షేక్ హాండిచ్చి కూర్చుని నా పరిచయం చేసుకున్నాను. నేను సెలక్ట్ అయినందుకు రెండు గ్రాముల బంగారం ఇచ్చి ప్రశ్నలడగటం మొదలెట్టింది.

"అమ్మ అంటే దగ్గరకొస్తాయి నాన్న అంటే దూరంగా పోతాయి ఏమిటవి"

ఓ క్షణం అర్థం కాలేదు. మొదటి ప్రశ్నకే ఇలా అయిందేమిటి. 'దేవుడా...దేవుడా! నువ్వే కాపాడు తండ్రీ' అనుకొంటూ ఉండగానే "మళ్లీ అడుగుతున్నాను. జాగ్రత్తగా వినండి" అంటూ అదే ప్రశ్ని

## అవన్నీ పుకార్లే!

మాండలిన్ వాద్యకారుడు రాజేష్‌తో మీరా జాస్మిన్ పెళ్లి జరిగిపోయిందనే వార్త ఇటీవల గుప్పుమంది. ఇదేంటబ్బా అని అటు ఇండస్ట్రీ, ఇటు ప్రేక్షకులూ విస్తుపోయిన సమయంలో మీరాజాస్మిన్ కచ్చితంగా తన కామెంట్‌ని వినిపించింది. 'ఈ వార్తలో ఎలాంటి నిజమూ లేదు. కొంతమంది పనిగట్టుకుని చేసిన ప్రచారం మాత్రమే' అని కొట్టిపారేసింది. ఇటీవల చెన్నయ్‌లో ఓ సంగీత కచేరీలో రాజేష్‌కి సన్నిహితంగా మీరా కనిపించడమే ఇలాంటి వార్తలకు దారి తీసి వుండవచ్చు అనేది కొంతమంది ఉవాచ. మొత్తానికి ఏదో ఓ రకంగా వార్తల్లో వుండడం ఒక్కొక్కరి ప్రత్యేకత కదూ!



ఈసారి పెదవుల్ని తమాషాగా కదిలిస్తూ సాగదీస్తూ అడిగింది.

వెంటనే అర్థమైపోయింది. "పెదవులు" అన్నాను సంతోషంగా.

"కరెక్టు" అంటూ రెండు గ్రాముల బంగారం ఇచ్చింది.

"మరో ప్రశ్న.. బయటకెళ్తే తెరుస్తాము. ఇంటికి రాగానే ముడుస్తాము. ఏమిటది?"

"గొడుగు" సంతోషంగా చెప్పాను.

"చాలా కరెక్టుగా చెప్పారు. ఇవిగోండి మరో రెండు గ్రాములు.

కవలల్లా ఉంటారు. ప్రక్కప్రక్కనే ఉంటారు కానీ ఒకర్నొకరు చూసుకోలేరు. ఏమిటవి?"

అర్థం కాలేదు. కొంచెం తికమకగా అనిపించి ఆలోచనలో పడ్డాను.

"మళ్లీ అడుగుతున్నాను. నా వైపు చూసి జాగ్రత్తగా వినండి" అనటంతో తలెత్తి ఆమె మొహంలోకి చూశాను.

కళ్లు రెండూ పైకి కిందకి, అటు పక్కకి ఇటు పక్కకి తిప్పుతూ అదే ప్రశ్నని మళ్లీ అడిగింది.

ఇందాకటి నుండి బాగానే ఉన్నదే... ఇప్పుడేమిటలా కళ్లని తెగ తిప్పేస్తుంది. ఏమైంది ఈమెకి అనుకొంటూ ఉండగానే సడెన్‌గా ఆన్సర్ స్ఫురించి "కళ్లు" అన్నాను.

"శభాష్. ఇవిగోండి మరో రెండు గ్రాములు"

అలా అలా అంచెలంచెలుగా అన్ని రౌండ్లు పూర్తి చేసి చివరికి అర కిలో బంగారం గెలుచుకున్నాను. ఇంతవరకు ఎవరు కూడా అంత బంగారం గెలుచుకోలేకపోయారని నన్ను ఓ సింహాసనం లాంటి కుర్చీ మీద కూర్చోబెట్టి స్పెషల్ గిఫ్ట్ అంటూ ఓ కిరీటాన్ని నా నెత్తిమీద పెట్టి చప్పట్లు మారుమోగుతుంటే నన్నో మహారాణిని చేసి సన్మానించారు.

ప్రపంచాన్ని జయించినట్లు ఫీలయిపోతూ ప్రోగ్రాం పూర్తి కాగానే కారులో ఇంటికి బయల్దేరి వస్తుంటే ఇద్దరు దొంగలు టీవీలో ప్రోగ్రాం చూసి స్టూడియో దగ్గరే కాచుకొని కూర్చున్నారట. నేను రావటం చూసి నా వెంట పడ్డారు.

అంత కష్టపడి గెలుచుకున్న బంగారాన్ని వాళ్లకెలా అందనిస్తాను. ఏం చెయ్యాలో అర్థం కాలేదు కాసేపు. తర్వాత 'జై కోవై సరళ' అని గట్టిగా అరిచి ఒక్కొక్కళ్లని కాళ్లతో ఎడాపెడా తన్నటం మొదలెట్టాను"

"నీ కల్లో దొంగలేమో కానీ నన్ను మాత్రం నడుము విరిగేలా వీరతన్నులు తన్నావు కదే. అయినా ఎవరైనా ధైర్యం కోసం 'జై వీరాంజనేయా' అని ఆంజనేయ స్వామిని గుర్తు చేసుకుంటారు లేదా కరాటే వీరుడు బ్రూస్లీని గుర్తు చేసుకుంటారు కానీ ఈ 'కోవై సరళ' ఎవరే నా నడుం విరగ్గొట్టడానికి?" అయోమయంగా అడిగాను.

"అదేనండి. సినిమాల్లో మొగుణ్ణి ఎడాపెడా తన్నేస్తుందే ఆమే"

"అమ్మో ఎప్పటి నుండో నీ మనసులో నన్ను కూడా ఇలా తన్నాలనే కోరిక ఉండి ఉంటుంది. దాన్నిప్పుడిలా తీర్చుకున్నావన్నమాట. ఇదన్న మాట నీ 'ఆఫ్టర్ వన్ మంత్' ప్లాను"

"శివ.. శివా.. ఏమిటండీ ఆ పాడు మాటలు. మిమ్మల్ని తన్నాలని నేనెందుకు అనుకుంటాను" అంటూ మెళ్లో ఉన్న మంగళసూత్రాల్ని కళ్లకద్దుకొని అప్పుడే లేచి వస్తున్న మా పుత్ర రత్నాల్ని చూసి తను కూడా పైకి లేవబోయి "అమ్మో!" అని బాధగా మూలిగి కింద కూర్చుండిపోయింది.

లలిత పరిస్థితి చూసి జాలేసింది. నేనే నెమ్మదిగా లేచి చెయ్యి ఆసరా ఇచ్చి జాగ్రత్తగా లలితని మంచం మీదికి చేర్చి పడుకోబెట్టాను. మా ఫ్యామిలీ డాక్టర్‌కి ఫోన్ చేసి అర్జెంటుగా రమ్మని చెప్పాను.

డాక్టరుగారు వచ్చి మా ఇద్దరి పరిస్థితి చూసి అంబులెన్స్ పిలిపించి హాస్పిటల్‌కి తీసికెళ్లారు. ఎక్స్‌రేలు తీసి రకరకాల పరీక్షలు చేసి చివరికి లలిత కుడికాలు ఫ్రాక్చర్ అయిందని తేల్చారు. కట్టుకట్టి నలభై రోజుల పాటు బెడ్‌రెస్టు తీసుకోవాలని, నేను కూడా కనీసం ఓ వారమన్నా బెడ్ రెస్టు తీసుకోవాలని చెప్పి ఓ బుట్టెడు మందులైతే మా చేత కొనిపించి మమ్మల్నిద్దర్నీ ఇంటికి చేర్చారు. బంగారం... బంగారం అంటూ కలలు కని బంగారం లాంటి కాలు విరగ్గొట్టుకుంది.


"చివరికి నీ 'ఆఫ్టర్ వన్ మంత్' సస్పెన్స్ ఇలా విడిపోయిందన్నమాట. ప్రోగాం పోయె టికెట్ టబ్బులు పోయె. నా ఆఫీస్ పోయె.. అన్నీ పోయినా ఏమి... కిరీటం బదులు కాలికి కట్టు, అరకేజీ బంగారం బదులు అరకేజీ టాబ్లెట్లు వచ్చాయి. ఇక నలభై రోజులు మహారాణిలా మంచం మీద నుండి దిగే పనే లేదు" డబుల్ కాట్ మీద లలిత పక్కనే పడుకొంటూ అక్కసుగా అన్నాను.

"చేసిన వెటకారం చాల్లేండి. ఏదో నా ఖర్మ కొద్దీ ఇలా జరిగింది కానీ నేను కనక వెళ్లినట్లయితే అరకేజీ బంగారం తప్పకుండా గెలిచేదాన్ని. దానికి నాకు వచ్చిన కలే నిదర్శనం. తెల్లవారుఝామున వచ్చిన కల తప్పకుండా నిజమవుతుందంటారు. ఎంచక్కా ప్రోగ్రాంలో పాల్గొని అరకేజీ బంగారం గెలిచి పాపకి నాకు చెరో వడ్డాణం చేయించుకొని మిగిలిన దాంతో మీకు బ్రాస్‌లెట్టు, మెళ్లో చెయిను, ఉంగరాలు చేయిద్దామనుకున్నాను. ఛ్ఛ.. అంతా రివర్స్ అయింది"

"కల చెదిరింది కథ మారింది కాలికి కట్టే ఇక మిగిలింది. కట్టే ఇక మిగిలింది" రాగం తీస్తూ సెల్ ఫోన్ చేతిలోకి తీసుకున్నాను అమ్మా నాన్నలని, అత్తా మామలని రమ్మని చెబుదామని.

"కట్టే.. కట్టే..అంటూ అరిగిపోయిన గ్రామఫోను రికార్డులా నన్నేం ఎగతాళి చెయ్యక్కర్లేదు. కాలు కాస్త తగ్గాక మళ్లీ ట్రై చేసి బంగారం గెలుచుకోకపోతే నా పేరు లలితే కాదు" ఛాలెంజ్ చేసింది సీరియస్‌గా.

ఆ మాట వినటంతోనే "ఓర్నాయనో... మళ్లీనా" అంటూ అవాక్కయ్యాను. చేతిలోని సెల్‌ఫోన్ జారిపోవటం కూడా గమనించలేదు.



## శ్రియ అదృష్టం!

తమిళనాట 'శివాజి' సినిమా ఘనవిజయంతో శ్రియకి మాంఛి క్రేజ్ వచ్చేసింది. అయితే వచ్చిన ఆఫర్లన్నింటినీ ఒప్పేసుకోకుండా ఆచితూచి అడుగేస్తోంది శ్రియ. ఆమె అంగీకరించిన వాటిల్లో కమల్‌హాసన్ హీరోగా పి.వాసు దర్శకత్వంలో నిర్మాణం కానున్న చిత్రం కూడా వుందిట. రజనీతో చంద్రముఖి లాంటి సినిమాని తీసిన పి.వాసు- కమల్ హాసన్‌తో సినిమా తీస్తాడంటే ఆ సినిమాకి క్రేజే క్రేజే. ఇక అలాంటి సినిమాలో హీరోయిన్ అంటే ఇక చెప్పేదేముంది? లక్కీ శ్రియ.